క్లుప్తంగా

వీఓఏలు, ఎన్యూమరేటర్లకు శిక్షణ

సీతంపేట: స్థానిక ఎంఎంఎస్‌లో వెలుగు ఎన్యూమరేటర్లు, వీఓఏలకు 2025–26 సంవత్సరానికి గాను వార్షిక అప్పులు, జీవనోపాధుల ప్రణాళికపై శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. ఈనెల 3వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా ఎలా బలోపేతం కావాలనే దానిపై మండలస్థాయిలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం కలమకుమారి పాల్గొన్నారు.

కె.వీరఘట్టం సర్పంచ్‌కు పతి వియోగం


రమణారావు (ఫైల్)

సీతంపేట: మండలంలోని కె.వీరఘట్టం సర్పంచ్ ఎ.చెంచమ్మ భర్త రమణరావు(55) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. 25 రోజుల క్రితం హార్ట్ స్ట్రోక్ రావడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చేరారు. సర్జరీ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. మృత్యువుతో కొద్ది రోజులుగా పోరాడుతూ ఆస్పత్రిలోనే తుదిశ్వాస విడిచారు. మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం, సాలూరు, పాలకొండ ప్రాంతాలకు సంబంధించిన రవాణా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను సీతానగరం మండలం చినభోగిలిలో గల ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ సెంటర్‌లో మాత్రమే చేయనున్నట్లు జిల్లా రవాణా అధికారి టి.దుర్గాప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లాలోని వాహన యజమానులందరూ ఈ విషయాన్ని గమనించి వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు చేసేందుకు చినభోగిలిలోని ఫిట్‌నెస్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు.

వార్షిక రుణ ప్రణాళికపై శిక్షణ


శిక్షణకు హాజరైన సీసీలు, వీఓఏలు, పొదుపు సంఘాల సభ్యులు

పార్వతీపురం రూరల్: పొదుపు సంఘాల జీవన ప్రమాణాలను, ఉపాధి మెరుగు పరుచుకునేలా ప్రణాళికలు తయారు చేయాలని వెలుగు ఏపీఎం బి.సన్నిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం వెలుగు కార్యాలయంలో వార్షిక రుణ ప్రణాళికపై శిక్షణ నిర్వహించారు. 2025–26 జీవనోపాధి కోసం యాప్‌లో ఏవిధంగా వివరాలు నమోదు చేయాలో ఈ శిక్షణలో సూచించారు. మహిళలను ఆర్థికంగా మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ఈ కార్యాచరణ రూపొందించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణలో సీసీలతో పాటు వీఓఏలు, సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

సారా తాగడంతో వచ్చే అనర్థాలు తెలుసుకోవాలి


సారా నిర్మూలన ర్యాలీ చేస్తున్న దృశ్యం

సీతానగరం: సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలు అవగాహన కల్పించుకోవాలని, సారాను తాగవద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీతానగరం సీఐ పద్మావతి అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు సారా తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సులు మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు సీఐ పద్మావతి మాట్లాడుతూ గ్రామాల్లో సారా నిర్మూలనే లక్ష్యంగా యూత్, మహిళాసంఘాల సభ్యులు ప్రజలను చైతన్య పర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు ,సిబ్బంది, యూత్‌సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిర్వహించాలి

బలిజిపేట: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించి, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని బలిజిపేట మండల భవన నిర్మాణ కార్మికుల సంఘం కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బలిజిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణకార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అసలైన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలని, సంక్షేమ బోర్డులో నమోదుచేసుకున్న కార్మికులకు ఈ శ్రమ పోర్టల్‌లో నమోదుచేసుకున్న కార్మికులకు విశ్వకర్మ యోజన అమలు చేయాలన్న డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి మన్మథరావు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


వీరఘట్టం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల టెన్త్‌క్లాస్ పరీక్ష కేంద్రం వద్ద ప్రచారం చేస్తున్న స్థానిక జీజేసీ అధ్యాపకులు


గంగమ్మపేట టెన్త్‌క్లాస్ పరీక్షా కేంద్రం వద్ద ప్రచారం చేస్తున్న స్థానిక జీజేసీ అధ్యాపకులు

మా కళాశాలలో చేరితే పాస్ గ్యారంటీ

- ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాల కోసం జీజేసీ అధ్యాపకుల ప్రచారం

వీరఘట్టం: మా కళాశాలలో చేరండి..పాస్ గ్యారంటీ..అంటూ వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ముమ్మర ప్రచారం చేపట్టారు. ఈ మేరకు మంగళవారం పదో తరగతి విద్యార్థులు చివరి పరీక్ష రాస్తుండడంతో మండలంలోని పలు టెస్ట్ పరీక్షా కేంద్రాల వద్దకు అధ్యాపకులు బృందాలుగా వెళ్లారు. ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్ల కోసం విద్యార్థులతో మాట్లాడారు. తమ కళాశాల తరఫున ముద్రించిన పాంప్లెట్స్‌ను విద్యార్థులకు అందజేశారు. కళాశాలలో ఉన్న గ్రూపులు, గతంలో తమ విద్యార్థులు సాధించిన విజయాలు, ల్యాబ్, విశాలమైన తరగతి గదులు ఇలా అనేక మౌలిక వసతులు ఉన్న తమ కళాశాలలో చేరాలని విద్యార్థులను కోరారు.


వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల ముద్రించిన పాంప్లెట్

● పరామర్శ


బాలేసులో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బాలేసు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త తోయక గణపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి.. మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అక్కడి నుంచి దుడ్డుఖల్లు గ్రామానికి వెళ్లి వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మక గౌరీశంకరరావును కూడా ఆమె పరామర్శించారు. గౌరీశంకరరావు తల్లి అన్నపూర్ణ ఇటీవల చనిపోగా ఆమె మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, బాలేసు సర్పంచ్ కళావతి, ఎంపీటీసీ సభ్యురాలు నిమ్మక ఉషారాణి, మాజీ ఎంపీటీసీ కె.రాజేష్ ఉన్నారు.

29మందిపై బైండోవర్ కేసులు


బైండోవర్ కేసులు నమోదు చేసిన వారిని విచారణ చేస్తున్న తహసీల్దార్

పాలకొండ: మండలంలోని 29 మందిపై ఎక్సైజ్ అధికారులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ బాల మురళీకృష్ణ ముందు వారిని హాజరుపరిచారు. ఈ సందర్భంగా సీఐ సూర్యకుమారి మాట్లాడుతూ నవోదయం–2లో భాగంగా సారా కేసులతో సంబంధం ఉన్నవారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. బైండోవర్ కేసుల్లో ఉన్నవారు మరోమారు నేరం చేసి పట్టుబడితే జరిమానాతో పాటు జైలుశిక్ష అనుభవించాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

మొక్కజొన్న వ్యర్థాలు కాల్చివేత


బిల్లుమడ వద్ద తగలబడుతున్న మొక్కజొన్న పంట వ్యర్థాలు

భామిని: మండలంలో మొక్కజొన్న పంట కోత సమయం కావడంతో పంట వ్యర్థాలు కాల్చివేయడంలో రైతులు తలమునకలయ్యారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని బిల్లుమడ, సింగిడి, పసుకుడి గ్రామాల సమీపంలోని మొక్కజొన్న తోటల కోతలు పూర్తి కావడంతో అవగాహన లేమితో రైతులు పంట వ్యర్థాల కాల్చివేత చేపట్టారు.దీంతో వాతావరణం కలుషితం కావడం, వేడి తీవ్రంగా పెరగడంతో పాటు భూమి సారవంతాన్ని పెంచే పంట వ్యర్థాలు వృథా చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. పంట వ్యర్థాలు భూమిలో కలియదున్నితే సారవంతం పెరుగుతుందని చెబుతున్నారు.

ప్రారంభమైన ఇంటర్ తరగతులు


వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు హాజరు కాకపోవడంతో వెలవెలబోతున్న తరగతి గది

- హాజరుకాని సెకెండియర్ విద్యార్థులు

వీరఘట్టం: ఈ ఏడాది ఇంటర్మీడియట్ విద్యా సంవత్సరాన్ని ఏప్రిల్ 1 నుంచి ప్రభుత్వం ప్రారంభించింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభించేందుకు మంగళవారం యథావిధిగా అధ్యాపకులు హాజరయ్యారు.అయితే విద్యార్థులు మాత్రం ఒక్కరు కూడా హాజరు కాకపోవడంతో తరగతి గదులు వెలవెలబోయాయి. పదిహేను రోజుల క్రితం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. సెకెండియర్ పరీక్షలు రాసిన విద్యార్థులు కళాశాల నుంచి రిలీవ్ అయ్యారు. ఫస్టియర్ విద్యార్థులు సెకెండియర్‌కు వచ్చారు. ఇలా సెకెండియర్ విద్యార్థుల కోసం తరగతులు ప్రారంభించగా ఒక్క విద్యార్థి కూడా హాజరు కాకపోవడం గమనార్హం. ఓ పక్క ఎండలు మండుతుంటే తరగతులకు ఎలా రాగలమని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు అంటే ఈ వేసవిలో ఎలా ఉండగలమని విద్యార్థులు వాపోతున్నారు. అయితే అధ్యాపకులు మాత్రం సెకెండియర్‌కు వచ్చిన విద్యార్థులకు ఫోన్లు చేస్తూ తరగతులకు హాజరు కావాలని కోరుతున్నారు.

సీహెచ్‌సీని సందర్శించిన 'కాయకల్ప' బృందం


ఆస్పత్రిలో సేవల వివరాలు పరిశీలిస్తున్న కాయకల్ప కమిటీ సభ్యులు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినమేరంగి సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం)ని రాష్ట్ర కాయకల్ప కార్యక్రమ బృందం మంగళవారం సందర్శించింది. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యం, సదుపాయాలు, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణపై వైద్య సిబ్బందిని ఆరాతీశారు. ఆస్పత్రి పనితీరు ఆధారంగా గ్రేడింగ్ చేసి, ఆస్పత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తారు. ఈ మేరకు ఆ బృందం ఆస్పత్రికి సందర్శించినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. కార్యక్రమంలో కాయకల్ప రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ సురేష్, ఆస్పత్రి వైద్యులు సునీల్‌కుమార్, ప్రతిమ, చైతన్య, పూర్ణచంద్రిక తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే కేసులు


వాహన తనిఖీలు చేడుతున్న పోలీసులు

పాలకొండ రూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠినమైన కేసులు తప్పవని ఎస్సై కె.ప్రయోగమూర్తి స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం పాలకొండ–శ్రీకాకుళం ప్రధాన రహదారిలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వాహన తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే పెండింగ్ చలానాల వసూలుపై దృష్టిసారించారు.

నేడు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి, ఇంటర్వ్యూలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. దరఖాస్తుదారులంతా సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

20 లీటర్ల సారా స్వాధీనం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం నుంచి చినమేరంగి వెళ్లే దారిలో తరలిస్తున్న 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు మంగళవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. సారా తయారు చేసినా, విక్రయించినా, తరలించినా నేరమని, అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా కూడా నేరమేనని అన్నారు.

ఎంపీడీవోకు బదిలీ

సీతంపేట: స్థానిక ఎంపీడీవో కె.గీతాంజలి బదిలీ అయ్యారు. అమరావతిలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పీఆర్ డిపార్ట్‌మెంట్‌కు ఫ్యాకల్టీగా ఆమెను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.ఈ మేరకు మంగళవారం ఆమె రిలీవ్ కాగా పాలకొండ ఈవోపీఆర్‌డీ టి.కృష్ణారావుకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు.

నేడు ఉచిత నేత్రవైద్య శిబిరం

సాలూరు: పట్టణంలోని నవజీవన్ ఆశ్రమంలో బుధవారం ఉచిత మెగా కంటి చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు స్వాతిశ్రీ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఐఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కంటి పరీక్షలు చేసి మందులు ఇవ్వనున్నామని, ఆపరేషన్ అవసరమైతే అదే రోజున ఆస్పత్రికి తీసుకువెళ్లి ఆపరేషన్ చేస్తారని పేర్కొన్నారు. ఆధార్, ఆరోగ్యశ్రీకార్డులు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

వేతనదారులు జాగ్రత్తలు పాటించాలి


ఉపాధి పనుల్లో వేతనదారులు

సీతానగరం: ఎండల తీవ్రత కారణంగా వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా తగినజాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు కోట సీతారాం పురం గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా వలస చెరువులో వేతనదారులు చేస్తున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున వేతనదారులు వడదెబ్బ బారిన పడే ప్రమాదముందన్నారు. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు వేతనదారులు చల్లనీరు అందుబాటులో ఉంచుకోవాలని, తలకు పాగా, కాళ్లకు చెప్పులు విధిగా ధరించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో ఉపాధి పనుల ప్రాధాన్యాన్ని బట్టి వేతనదారులందరికీ పనులు కల్పించనున్నట్లు తెలిపారు. టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సకాలంలో వ్యాధుల లక్షణాలు గుర్తించాలి


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డా. టి. జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాల ద్వారా అన్ని వైద్య సదుపాయాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందజేయాలని వైద్యులు, సిబ్బంది ఆ ప్రాంతాల్లో వ్యాధుల లక్షణాలను సకాలంలో గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డా. టి. జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని పుట్టూరు, చిన బొండపల్లి గ్రామాలకు ఆకస్మికంగా వెళ్లి పరిశీలించారు. ఆ ప్రాంతాల్లో అందుతున్న వైద్య సేవలపై పర్యవేక్షణ చేశారు. ఆరోగ్య సర్వేల ద్వారా వ్యాధి లక్షణాల తీరును పరిశీలించి, ఎన్‌సీడీ సర్వే ఏ మేరకు పూర్తి చేశారో యాప్‌లో పరిశీలించారు. ప్రజలకు నిర్వహిస్తున్న పరీక్షలు, చికిత్సలకు సంబంధించిన రికార్డులను తీసి పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డా.ఐశ్వర్య, యోగీశ్వరరెడ్డి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సరదాగా.. సందడిగా..


భామిని పరీక్షా కేంద్రం వద్ద టెన్త్ విద్యార్థుల సందడి

భామిని: విద్యార్థి దశలో కీలకమైన టెన్త్ క్లాస్ పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థులు ఉల్లాసంగా పరీక్ష కేంద్రాలనుంచి మంగళవారం బయటకు వచ్చారు. భామిని మండలంలోని ఏపీ మోడల్ స్కూల్, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బత్తిలి జిల్లా పరిషత్ స్కూల్ పరీక్షా కేంద్రాల నుంచి విద్యార్థులు సరదాగా సందడిగా కేరింతలతో బయటపడ్డారు. మూడు కేంద్రాల్లో 482 మందికి గాను 478 మంది మాత్రమే పరీక్షలు రాశారు. నలుగురు విద్యార్థులు పరీక్షలకు దూరమయ్యారు. పరీక్షా ఫలితాల అనంతరం గమ్యాలు మారి ఒకరికొకరు దూరమవుతామన్న ఆందోళన విద్యార్థుల్లో కనిపించింది. ఒకిరి అడ్రస్ ఒకరు రాసుకుంటూ, టీచర్ల ఫోన్ నంబర్లు తీసుకుంటూ వెళ్లారు.

గిరిజన కళల అభివృద్ధికి కృషి

- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి


ఆర్ట్‌ను పరిశీలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: గిరిజన కళల అభివృద్ధికి కృషి చేస్తానని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పీఎంఆర్‌సీలో సవర పెయింటింగ్ శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించి చిత్రకారులు వేసిన పెయింటింగ్స్‌ను పరిశీలించారు. సవర పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ప్రదర్శించేందుకు పీఎంఆర్‌సీలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండు గదులు కేటాయించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఐటీసీఓ డైరెక్టర్ సుధీర్, అపర్ణ, లక్ష్మి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నీటితొట్టెల నిర్మాణానికి భూమిపూజ


జియ్యమ్మవలస: నీటితొట్టెల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సురేష్


నీటితొట్టె నిర్మాణానికి మట్టి తవ్వుతున్న నాయకులు, అధికారులు

వీరఘట్టం: మండలంలోని కంబర గ్రామంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా నీటితొట్టెల నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. 2X5 కొలతలతో రూ.32 వేల ఖర్చుతో ఈ నీటి తొట్టెలను నిర్మిస్తున్నట్లు ఏపీఓ జి.సత్యంనాయుడు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాదిలాపు కృష్ణమూర్తి నాయుడు, సచివాలయం సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మండల కేంద్రంలో పశువుల దాహార్తి తీర్చేందుకు గాను తాగునీటి తొట్టెల నిర్మాణానికి ఎంపీపీ బొంగు సురేష్ మంగళవారం భూమిపూజ చేశారు. వేసవి ఎండల నేపథ్యంలో పశువులు సహా చాలా మూగజీవాలు దాహంతో అల్లాడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం నిధులతో ఈ నిర్మాణాలు చేస్తున్నామని, పశువులు నీరు తాగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రమేష్, పశువైద్యాధికారి మునికుమార్, ఏపీవో తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

నేలకూలిన చెట్టు


రోడ్డు మధ్యలో నేలకూలిన చెట్టు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాలురు)కు దగ్గరలోని ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న ఓ భారీ చెట్టు మంగళవారం సాయంత్రం నేలకూలింది. దీంతో అక్కడి రోడ్డుకు ఇరువైపులా వచ్చే వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

విషయం తెలుసుకున్న కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు జేసీబీ సాయంతో చెట్టును పక్కకు నెట్టివేయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. చెట్టు పడే సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో ప్రమాదమేమీ జరగలేదని ఎస్ఐ తెలిపారు.

పశువుల తొట్టెల ఏర్పాటు


వాటపాగులో పశువుల తొట్టెల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: మండలంలోని వాటపాగు గ్రామంలో పశువుల దాణా తొట్టెల నిర్మాణ పనులను ఎంపీడీఓ ఎంవీ రంగారావు నేతృత్వంలో ప్రారంభించారు. ఉపాధి పనుల్లో భాగంగా మంగళవారం ఏపీఓ ఈశ్వరమ్మ సమక్షంలో పాడి రైతులకు అవసరమైన ఈ పనులకు శ్రీకారం చుట్టారు. పాడి రైతులు నిర్దేశిత నిబంధనలు కలిగి ఉంటే ఉపాధిహామీ పథకం ద్వారా ఈ తొట్టెల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

బిత్రపాడులో ఏనుగుల సంచారం


బిత్రపాడు పంటపొలాల్లోకి వెళ్తున్న గజరాజుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు పంట పొలాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. మంగళవారం ఉదయం కన్నపుదొరవలస, బట్లబద్ర ప్రాంతాల్లోని వరి పంటను ధ్వంసం చేసి, సాయంత్రానికి బిత్రపాడు చేరుకున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పొట్ట దశలోని వరి పంటను ఆ ఏనుగులు నాశనం చేస్తే పూర్తిగా నష్టపోవాల్సిందేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, ఏనుగులను మళ్లించే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.